సాక్షి
జోగులాంబ గద్వాల
బుధవారం : 21 : ఫిబ్రవరి : 2024



ఇసుక వార్

ఇసుక వ్యవహారం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఆరోపణలకు వేదికగా మారింది.

వివరాలు 8లో ▸



ఘనంగా ఆరుద్రోత్సవం

అలంపూర్ ఆలయాల్లో ఆరుద్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
38.0 /17.4

వాతావరణం

ఎండతీవ్రత పెరుగుతుంది. ఉదయం, సాయంత్రం చలి కాస్త తగ్గుతుంది. ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది.

కృష్ణమ్మకు ప్రణమిల్లి

ఉమ్మడి పాలమూరులోని మక్తల్ నియోజకవర్గంలో కృష్ణానది తీరాన దత్తాత్రేయుడు, కృష్ణమ్మ విగ్రహాలకు మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పూజలు నిర్వహించి.. కృష్ణమ్మ క్లస్టర్ పరిధిలో యాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి బస్సు యాత్ర మక్తల్‌కు చేరుకోగా.. బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, సహకార శాఖ మంత్రి పురుషోత్తం రూపాలతో కలిసి మాట్లాడారు. ఊట్కూరులో రైతులతో ముచ్చటించారు. నారాయణపేట సత్యనారాయణచౌరస్తాలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. తొలిరోజు యాత్ర 33 కిలోమీటర్లు కొనసాగింది. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప్ యాత్రతో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/మక్తల్

బీజేపీ విజయ సంకల్ప్ యాత్ర షురూ

- నదీతీరాన పూజలు చేసి ప్రారంభించిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- మధ్యాహ్నం మక్తల్‌లో కార్నర్ మీటింగ్.. హాజరైన కేంద్ర మంత్రి రూపాల
- ఊట్కూరులో రైతులతో మాటామంతి.. రాత్రి నారాయణపేటలో మీటింగ్, బస
- తొలిరోజు 33 కి.మీ..ల మేర సాగిన బస్సు యాత్ర



మక్తల్‌లో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల, చిత్రంలో కిషన్‌రెడ్డి, డీకే అరుణ, జితేందర్‌రెడ్డి, శాంతికుమార్, బంగారు శ్రుతి, నాగురావు నామాజీ, రతంగ్‌పాండురెడ్డి, కొండయ్య తదితరులు

'2013లో ఇదే కృష్ణ నుంచి తెలంగాణ పోరు యాత్ర ప్రారంభించాం. అప్పటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. పోరు యాత్ర చేపట్టిన అదే స్థానం నుంచి ఆ దేవుడు, కృష్ణమ్మ తల్లి ఆశీస్సులతో తెలంగాణలో మార్పు తీసుకురావాలని మళ్లీ ఈ రోజు విజయ సంకల్ప్ యాత్ర చేపట్టాం.' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. గత కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోతలు.. బావుల దగ్గరకు పోవాలంటే ఇబ్బందులు పడేవారన్నారు. ఎరువులు ఐదు సంచులు కావాలంటే ఒక సంచి ఇచ్చేవారని.. ఇప్పుడు ఆ సమస్యలు ఉన్నాయా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా, ఎలాంటి ఎరువుల కొరత లేదు.. కరెంట్ కోతలు లేవన్నారు. అన్నిరకాలుగా దేశంలో మంచి వాతావరణం ఉందన్నారు. దానికి కారణం నరేంద్ర మోదీయేనన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో పొదుపు సంఘాలకు రూ.2 లక్షల రుణాలు మాత్రమే ఇచ్చేవారని.. అదే మోదీ ప్రభుత్వంలో రూ.20 లక్షల వరకు ఇస్తున్నట్లు గుర్తు చేశారు. పీఎం కిసాన్ కింద రైతులకు నాలుగు నెలలకోసారి డబ్బులు వస్తున్నాయని.. భూసార పరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు. తెలంగాణలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్కరికైనా డబుల్ బెడ్‌రూం వచ్చిందా.. అని ప్రశ్నించారు. తెలంగాణలో ఎంత జనాభా ఉందో అంత మొత్తంలో దేశమంతా నాలుగు కోట్లకు పైగా ఇళ్లను కట్టించిన ఘనత మోదీ సర్కార్‌దేనన్నారు. అలాగే పేద మహిళలు కట్టెల పొయ్యితో ఇబ్బంది పడొద్దని కోట్లాది గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. అలాగే నరేంద్రమోదీ పాలనలో బాంబులు లేవు.. కర్ఫ్యూ లేదు.. ఏకే 47 లేదు.. పాకిస్తాన్ ఐఎస్ఐ ఏజెంట్లు లేరు. ఉగ్రవాదం, పాకిస్తాన్ ఐఎస్ఐ ఏజెంట్లను ఉక్కుపాదంతో అణచివేస్తుండటంతోనే దేశంలో శాంతి నెలకొందన్నారు.

పథకాలు వచ్చాయా..?

తెలంగాణలో ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి ఏమన్నారు.. ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచి ఎవరూ కరెంట్ బిల్లు కట్టొద్దన్నారు.. నేను రాగానే రైతు రుణమాఫీ చేస్తా.. ఎకరాకు రూ.15 వేలు ఇస్తా.. మహాలక్ష్మి కింద మహిళలు ఎంత మంది ఉంటే అంత మందికి నెలకు రూ.2,500 ఇస్తామన్నారు.. ఏ ఒక్కరికైనా ఆయా పథకాలు వచ్చాయా అని అన్నారు. నారాయణపేట కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ఏప్రిల్‌లో జరగవచ్చని, పాలమూరు గడ్డపై కాషాయ జెండా ఎగరవేయాలని కిషన్‌రెడ్డి అన్నారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర నాయకులు నాగూరావు నామాజీ, బంగారు శ్రుతి, కొండయ్య, మాదిరెడ్డి జలేంధర్‌రెడ్డి, రతంగ్‌పాండురెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ పావని, మాగనూర్ ఎంపీపీ శ్యామలమ్మ, నాయకులు కనకరాజు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

అవినీతికి తావులేదు..

మహాభారతంలో కృష్ణుడు రథసారథిగా యాత్ర చేపట్టి విజయం సాధించారు.. అలాగే తెలంగాణలో కిషన్‌రెడ్డి సారథ్యంలో ఈ రథయాత్ర బీజేపీని విజయపథం వైపు నడిపిస్తుందని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, సహకార శాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. మోదీ ప్రభుత్వంలో అవినీతికి తావులేదన్నారు. దళారుల బెడద లేకుండా ఢిల్లీ నుంచి రూ.30 లక్షల కోట్లు డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారులకు నగదు పంపించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు గుర్తు చేశారు. దేశంలో అవినీతి రహిత పాలన ఒక్క నరేంద్రమోదీతోనే సాధ్యమన్నారు.

గుర్తింపు తెచ్చిన ఘనత మోదీదే

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడుతూ ప్రపంచంలో భారత్‌కు గొప్ప గుర్తింపు తెచ్చిన ఘనత మోదీదే అన్నారు. దేశంలోని ప్రతి ఆడబిడ్డ ఆత్మభిమానంతో బతికేలా ఆలోచించి మరుగుదొడ్లు నిర్మించారని, ముద్ర లోన్లు, మహిళా సంఘాలకు తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చారన్నారు. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించిన మోదీకి మహిళలు రుణపడి ఉండాలని కోరారు.

తొలిరోజు యాత్ర సాగిందిలా..

- కిషన్‌రెడ్డి 11 గంటలకు చేరుకొని దత్తాత్రేయ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కృష్ణానది దగ్గర ఉన్న కృష్ణమ్మ విగ్రహానికి పూజలు చేశారు. విజయ సంకల్ప్ యాత్రను ప్రారంభించి శంఖం పూరించారు.
- మధ్యాహ్నం 12 గంటలకు కృష్ణ నుంచి హిందుపూర్ మీదుగా టైరోడ్డుకు చేరుకున్నారు. అక్కడి నుంచి గుడేబల్లూర్ మీదుగా మాగనూర్.. ఆ తర్వాత యాత్ర మక్తల్‌కు చేరుకుంది.
- 1.40 గంటలకు మక్తల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. 2 గంటలకు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో నేతలు మాట్లాడారు. 3.20 గంటలకు మక్తల్ నుంచి ఊట్కూర్ చేరుకున్నారు.
- అయ్యప్ప ఆలయం దగ్గర సాయంత్రం 4 గంటలకు భోజనం చేసి అనంతరం ఆలయ ప్రాంగణంలో రైతులతో ముఖాముఖిలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. జింకల సమస్యల అధికంగా ఉందని రైతులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.
- 4.40 గంటలకు ఊట్కూర్ నుంచి ఒబ్లాపూర్, తిప్రాస్‌పల్లి మీదుగా నారాయణపేట మండలం సింగారం క్రాస్ గుండా 5.30 గంటలకు నారాయణపేటకు చేరుకున్నారు.

కేంద్ర నిధులతోనే అభివృద్ధి

జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రజలు పని.. కూలీ లేక పస్తులుంటే ఇంట్లో ఒక్కరికి 5 కిలోల చొప్పున బియ్యం ఉచితంగా ఇచ్చారన్నారు. రోడ్లు, లైట్లు, వందేభారత్ రైళ్లు ఇలా అన్ని రకాల అభివృద్ధి కేంద్ర నిధులతోనే జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని, ప్రతిపక్షాలకు డిపాజిట్లు రాకుండా చేయాలన్నారు.

భారతీయుల కల సాకారం..

బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ మాట్లాడుతూ ఐదు శతాబ్దాలుగా ఎదురుచూసిన రామ మందిరాన్ని నిర్మించేందుకు ఆ శ్రీరాముడే ఎన్నుకున్న గొప్ప భక్తుడు నరేంద్ర మోదీ అన్నారు. భారతీయుల కల మోదీ రూపంలో నెరవేరిందన్నారు. అలాంటి గొప్ప వ్యక్తిని మరోసారి ప్రధానిని చేసేందుకే మేము ప్రజల్లోకి వచ్చామన్నారు. పేదల బతుకులు బాగుపడాలంటే, దేశం సురక్షితంగా ఉండాలంటే మళ్లీ బీజేపీనే గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు

న్యూస్‌రీల్

డీడబ్ల్యూఓగా సుధారాణి



గద్వాల అర్బన్: జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి (డీడబ్ల్యూఓ)గా సుధారాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి డీడబ్ల్యూఓగా పనిచేసిన ముషాయిదా బేగం మహబూబ్‌నగర్ అడిషనల్ డీఆర్డీఓగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నిజామాబాద్ జిల్లా భీంగల్ సీడీపీఓగా విధులు నిర్వహించిన సుధారాణి బదిలీపై జిల్లాకు వచ్చారు. డీడబ్ల్యూఓగా బాధ్యతలు చేపట్టిన సుధారాణికి ఐసీడీఎస్, బాలల సంరక్షణ విభాగం సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



గద్వాల రూరల్: బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గద్వాల మండలం బీరెల్లికి చెందిన పార్టీ కార్యకర్త దుబ్బ బీసన్న ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందగా.. అతడి కుటుంబానికి పార్టీ నుంచి మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో రమేష్‌నాయుడు, లత్తీపురం రాజు, బీచుపల్లి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అలంపూర్: అలంపూర్ సబ్ డివిజన్ పరిధిలో బుధవారం ఉదయం 8నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ మహ్మద్ చిన్న మక్బూల్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 33 కేవీ శాంతినగర్–1 ఫీడర్ లైన్‌లో చెట్లకొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. శాంతినగర్, ఉండవెల్లి, ఎర్రవల్లి, మానవపాడ్ సెక్షన్ల పరిధితో పాటు 33/11 కేవీ సబ్ డివిజన్‌లోని రామాపురం, ఉండవెల్లి, మారమునగాల, అలంపూర్ చౌరస్తా, బీచుపల్లి, కోదండాపూర్, ఇటిక్యాల, చాగాపూర్, సాతర్ల, శాసనూలు, ఆర్.గార్లపాడు, జల్లాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వేరుశనగ క్వింటా రూ.6,666

గద్వాల వ్యవసాయం: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 920 క్వింటాళ్ల వేరుశనగను రైతులు తీసుకురాగా.. క్వింటాకు గరిష్ఠంగా రూ.6666, కనిష్ఠంగా రూ. 3411, సరాసరి రూ. 4869 ధరలు వచ్చాయి. 4 క్వింటాళ్ల ఆముదం రాగా.. క్వింటాకు రూ. 5,611 ధర పలికింది. 8 క్వింటాళ్ల కందులు రాగా.. గరిష్ఠంగా రూ. 9,506, కనిష్ఠంగా రూ. 9,426, సరాసరి రూ. 9,439 ధరలు వచ్చాయి.

మహిళల భద్రతే సఖి లక్ష్యం



మల్దకల్: మహిళలకు భద్రత కల్పించడమే సఖి ప్రధాన లక్ష్యమని సఖి కేంద్రం నిర్వాహకురాలు కవిత అన్నారు. మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం సఖి సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలపై లైంగిక వేధింపులు, గృహహింస, వరకట్న వేధింపులు, ఆడపిల్లల అక్రమ రవాణా వంటివి చట్టరీత్యా నేరమన్నారు. మహిళలకు సఖి అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలకు ఎలాంటి ఆపద వచ్చినా డయల్ 181 లేదా 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌లింగం, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



స్టేడియాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం, తేరు మైదానాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడున్న డీఎస్ఓ, స్టేడియం ఇన్‌చార్జి, క్రీడాకారులతో కలెక్టర్ మాట్లాడారు. స్టేడియంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇండోర్ స్టేడియంలో జిమ్, షటిల్, తైక్వాండో సదుపాయాలు కల్పించడంపై కలెక్టర్ సంతోషం వ్యక్తంచేశారు. క్రీడలకు తేరు మైదానం, ఇండోర్ స్టేడియం అనుకూలంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ క్రికెట్, షటిల్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో డీఎస్ఓ బీఎస్ ఆనంద్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్, పీఈటీలు కృష్ణ, శ్రీనివాసులు, హైమావతి, శైలజ, శ్రీహరి, అరుణ్ పాల్గొన్నారు.

చదవడం రాకపోతే ఎలా?

గట్టు: పదో తరగతి విద్యార్థులకు తెలుగు చదవడం రాకపోతే ఎలా అని చాగదొన ఉన్నత పాఠశాల హెచ్‌ఎంపై కలెక్టర్ సంతోష్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలోని చాగదొన, మాచర్ల ఉన్నత పాఠశాలలతో పాటు గట్టు బాలికల గురుకులాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి, అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈక్రమంలో చాగదొన పాఠశాలలో కొందరు పదోతరగతి విద్యార్థులతో తెలుగు చదివించగా తడపడ్డారు. విద్యార్థుల ప్రగతిపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని.. ఇందుకు విద్యార్థులను మూడు గ్రేడ్లుగా విభజించాలని తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి డీఈఓ ఇందిర, తహసీల్దార్ సరితారాణి ఉన్నారు.

రూ.వంద కోట్లతో సమగ్ర అభివృద్ధి

- వీడియో కాన్ఫరెన్స్‌లో పీఎం ఉషా స్కీం నిధులు విడుదల చేసిన ప్రధాని మోదీ
- హాజరైన ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యే, పీయూ వీసీ తదితరులు



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ మన్నె, కలెక్టర్ రవినాయక్, ఎమ్మెల్యే యెన్నం, వీసీ లక్ష్మీకాంత్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: దేశంలోని యూనివర్సిటీల్లో కెల్ల పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు కేటాయించడం గొప్ప విషయం అని కలెక్టర్ రవినాయక్ అన్నారు. ఈ నిధులతో పీయూ సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని ఆకాంక్షించారు. మంగళవారం పీయూలో కేంద్ర ప్రభుత్వం పీఎం ఉషా స్కీం ద్వారా రూ.100 కోట్ల విడుదల కార్యక్రమం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ పాలమూరు యూనివర్సిటీని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. పీయూ చరిత్రలో ఇది ఒక అద్భుతమైన రోజు అని, పాలమూరు విద్యార్థులు సంతోషించాల్సిన విషయమన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పీయూ పురుడు పోసుకుని, విశ్వవిద్యాలయంగా ఆవిర్భవించి ఎంతో మంది పాలమూరు బిడ్డలకు ఉన్నత చదువులు అందించే స్థాయికి ఎదిగిందన్నారు. జిల్లాలోని విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో కేంద్రం గుర్తించి నిధులు ఇచ్చే స్థాయికి పీయూ ఎదగడం వెనక అందరి సమష్టి కృషి ఉందన్నారు. అంతేకాకుండా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు కూడా నిధులు విడుదలయ్యాయని, వాటి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

శుభపరిణామం..

పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉషా స్కీం ద్వారా పీయూకు రూ.100 కోట్లు కేటాయించడం శుభపరిణామం అన్నారు. ఈ నిధులతో పీయూలో కొత్త భవనాలు, విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పన, కంప్యూటర్ విద్య వంటి అంశాలపై దృష్టి కేంద్రీకరించి, వారికి నాణ్యమైన విద్య అందించేందుకు కృషిచేస్తామన్నారు. పరిశోధనలపై మరింత దృష్టిసారిస్తామన్నారు. పీయూకు నిధులు వచ్చేందుకు సహకరించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, పీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, రాజ్‌కుమార్, చంద్రకిరణ్, సుజాత, బషీర్ అహ్మద్, కిషోర్, నూర్జహాన్ పాల్గొన్నారు.

కొడంగల్‌కు మహర్దశ

నేడు కోస్గికి సీఎం రేవంత్‌రెడ్డి రాక




సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్లు, ఎస్పీ ఇతర అధికారులు

- రూ.4,250 కోట్ల పనులకు శంకుస్థాపన
- నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతలకు సైతం..
- అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం
- ప్రత్యేక చొరవతో మారునున్న రూపురేఖలు



కోస్గి: వివిధ రకాల కారణాలతో కొడంగల్ నియోజకవర్గం ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దుగా ఉన్న ఈ ప్రాంతంలో సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో నేటికీ వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎలాంటి సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడం.. యువతకు ఉపాధి దొరక్కపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి జీవనోపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో అనూహ్య పరిణామాల మధ్య రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడం.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో కొడంగల్ నియోజకవర్గానికి మహర్దశ పట్టింది. ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. కొడంగల్‌ను అన్నిరంగాల్లో తీర్చిదిద్ది.. రాష్ట్రానికి రోల్ మోడల్‌గా తయారు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారు. ఈ మేరకు పలు అభివృద్ధి పనులకు రూ.కోట్లలో నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేయనున్నారు.



కొడంగల్ నియోజకవర్గ మ్యాప్

మొదటిసారిగా రాక..

రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత బుధవారం మొదటిసారిగా సొంత నియోజకవర్గానికి వస్తున్నారు. రూ.4,250.19 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కోస్గిలో శంకుస్థాపన చేయనున్నారు. అలాగే నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల నిర్మాణానికి రూ.2,945.5 కోట్లు మంజూరు చేశారు. ఎత్తిపోతలతోపాటు పలు అభివృద్ధి పనులకు మరో 12 జీఓలు జారీచేసి, మొత్తం రూ.4,250.19 కోట్లు విడుదల చేశారు. సీఎం పర్యటనకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

పర్యటన షెడ్యూల్ ఇలా..

- 3.30 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి హెలీకాప్టర్ ద్వారా బయలుదేరుతారు.
- సాయంత్రం 4 గంటలకు కోస్గికి చేరుకుంటారు
- 4.05 గంటలకు కళాశాల మైదానానికి రోడ్డు మార్గంలో చేరుకుంటారు
- 4.10 గంటలకు పలు అభివృద్ధి పనులకు సామూహిక శంకుస్థాపన చేస్తారు
- 4.25 గంటలకు మహిళా సంఘాల స్టాళ్లను సందర్శిస్తారు
- 4.35 గంటలకు మహిళా సంఘాల ప్రతినిధులతో పరస్పర చర్చా కార్యక్రమం
- 4.55 మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల చెక్కుల పంపిణీ
- 5.05 ధన్యవాద తీర్మానం (ఓట్ ఆఫ్ థ్యాంక్)
- 5.10 బహిరంగ సభా స్థలానికి చేరుకుంటారు
- 5.15 బహిరంగ సభ ప్రారంభం
- 6.15 హైదరాబాద్‌కు రోడ్ మార్గం తిరుగు ప్రయాణం అవుతారు

రెండు నెలల వ్యవధిలోనే..

కొడంగల్ నియోజకవర్గానికి రెండు నెలల వ్యవధిలోనే రూ.కోట్లలో నిధులు మంజూరయ్యాయి. వీటితో అభివృద్ధి పనులు పూర్తయితే కొడంగల్ నియోజకవర్గ రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ఇప్పటికే కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా)ని ఏర్పాటు చేసి, ప్రత్యేకాధికారిని సైతం నియమించారు. నియోజకవర్గంలోని ప్రతి పల్లె, తండాకు బీటీ రోడ్లు మంజూరు చేశారు. రూ.వందల కోట్లతో మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నారు. ముఖ్యంగా కొడంగల్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో విశ్వవిద్యాలయం ఏర్పాటుతోపాటు పలు విద్యాసంస్థలు, పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన భూమిని రెవెన్యూ అధికారులు గుర్తిస్తున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారికి నోటీసులు జారీచేస్తున్నారు. ఇప్పటికే పలువురు రాష్ట్రస్థాయి అధికారులు నియోజకవర్గంలో పర్యటించి నివేదికలను ప్రభుత్వానికి అందజేశారు. రానున్న రోజుల్లో కొడంగల్ అన్నిరంగాల్లో ప్రగతి సాధించడం ఖాయమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోస్గి పర్యటన నేపథ్యంలో మంగళవారం నారాయణపేట, వికారాబాద్ కలెక్టర్లు శ్రీహర్ష, నారాయణరెడ్డి, నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్ ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణ శివారులోని తాండూరు రోడ్డులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ స్థలంతోపాటు అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేసి శిలాఫలకాలు వేసే స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించి కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీస్ శాఖ ఏర్పాటు చేసే బారికేడ్లు, భద్రత, పార్కింగ్ అంశాలపై ఎస్పీతో చర్చించారు. సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వారి వెంట అదనపు కలెక్టర్లు మయాంక్ మిట్టల్, అశోక్‌కుమార్, రాహుల్‌శర్మ, తహసీల్దార్ శ్రీనివాసులు, డీఎస్పీ లింగయ్య, సీఐ సోమనర్సయ్య, ఎస్బీ సీఐ రాంలాల్, ఎస్ఐ శేఖర్‌గౌడ్ తదితరులున్నారు.

- అనంతరం ఎస్పీ యోగేష్ గౌతం స్థానిక ఫంక్షన్ హాల్‌లో పోలీసు అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తులో నలుగురు ఏఎస్పీలు, 8 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 95 మంది ఎస్ఐలు, 75 మంది ఏఎస్ఐలు, 160 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 160 మంది కానిస్టేబుళ్లు, 250 మంది హోంగార్డు బందోబస్తు విధుల్లో పాల్గొంటారన్నారు.

వైభవంగా జములమ్మ బ్రహ్మోత్సవాలు



నాగపడిగ ధరించి గుర్రంగడ్డకు బయల్దేరిన పూజారులు

- నేడు మెట్టినింటికి చేరుకోనున్న అమ్మవారు

గద్వాలన్యూటౌన్: నడిగడ్డ ప్రజల ఇలవేల్పు జములమ్మ బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. డప్పుల మోతలు, మంగళ వాయిద్యాలు, వేలాది మంది భక్తి పారవశ్యం మధ్య జమ్మిచేడు దేవాలయం నుంచి అమ్మవారి పుట్టినిల్లు అయిన గుర్రంగడ్డకు ఎడ్లబండి బయల్దేరింది. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి నాగపడిగకు సంప్రదాయబద్ధంగా పూజలు జరిపించగా.. పూజారులు తలపై ధరించి ఎడ్లబండిపై గుర్రంగడ్డకు బయల్దేరారు. బుధవారం గుర్రంగడ్డ నుంచి జములమ్మ బయల్దేరి, మెట్టినిల్లు అయిన జమ్మిచేడు దేవాలయానికి చేరుకోనున్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, తిరుపతయ్య దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలుచేశారు. వారికి ఆలయ చైర్మన్ గాయత్రి, ఈఓ పురేందర్‌కుమార్ సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొన్న బొలెరో వాహనం: వ్యక్తి మృతి



చిన్న సంజీవ(ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన చిన్న సంజీవ(45) మంగళవారం ఉదయం 9.30 ప్రాంతంలో చౌదర్‌పల్లి నుంచి అతని ద్విచక్ర వాహనంపై జడ్చర్లకు వెళ్తుంటే అప్పన్నపల్లి బ్రిడ్జి దాటిన తర్వాత బొలెరో వాహనం వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో సంజీవ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రెండు కార్లు ఢీ : తప్పిన ప్రమాదం



మరికల్: రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఐదుగురికి ప్రమాదం తప్పిన ఘటన మంగళవారం రాత్రి పెద్దచింతకుంట స్టేజి సమీపంలో చోటు చేసుకుంది. కారులో కర్ణాటకలోని యాద్గిర్ చెందిన కుటుంబ సభ్యులు మహ్మద్ మోసిన్, సహిదషహిన్, చిన్నారులు మహ్మద్ జారియ, సహిద మోసిన్, అబ్బుషేక్ సిద్దిక్ మహబూబ్‌నగర్ నుంచి కారులో సొంతూరికి బయలుదేరారు. మరికల్ మండలం పెద్దచింతకుంట స్టేజీ సమీపంలోకి రాగానే మరికల్ నుంచి వస్తున్న ఓ కారు వీరి కారును ఢీకొట్టింది. దీంతో రోడ్డు పక్కన కారు బోల్తా పడింది. అక్కడే ఉన్నా పెద్దచింతకుంటకు చెందిన తుమ్మల్లి చెన్నప్ప కారులో ఇరుక్కుపోయిన ఐదుగురిని బయటకు తీశాడు. ఢీకొట్టిన కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి: నిందితుడికి జైలుశిక్ష

గోపాల్‌పేట: రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి మంగళవారం వనపర్తి జిల్లా కోర్టులో జైలుశిక్ష పడినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. నర్సింగాయపల్లికి చెందిన ఎల్లప్ప ఆగస్టు 5, 2015నాడు సొంత పనిమీద వనపర్తికి వెళ్లేందుకు నర్సింగాయపల్లి బస్టాండులో బస్సుకోసం వేచి ఉన్నాడు. వనపర్తి వైపు నుంచి పాన్‌గల్ మండలం రేమొద్దులకు చెందిన లింగస్వామి ద్విచక్రవాహనంపై నిర్లక్ష్యంగా నడుపుతూ వచ్చి ఎల్లప్పను ఢీకొట్టాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలు కాగా మహబూబ్‌నగర్, అక్కడి నుంఇచ హైదరాబాద్ తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు పూర్తి వివరాలు సేకరించి చార్జిషీట్ దాఖలు చేయగా మంగళవారం నిందితుడు లింగస్వామికి సంవత్సరం జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మర్లపాయ ప్రాంతంలో కార్చిచ్చు



లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని నల్లమల ప్రాంతంలో మంటలకు అటవీ ప్రాంతం దగ్ధమవుతుంది. మంగళవారం నల్లమల ప్రాంతంలోని మర్లపాయ పరిసర ప్రాంతం అడవిలో కార్చిచ్చు రగులుకుంది. మంటలను అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్న సాధ్యం కావడం లేదని ఎఫ్‌ఆర్‌ఓ వీరేశం తెలిపారు. మంటలను అదుపు చేయడానికి సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలిపారు. వేసవి కాలం కావడంతో అటవీ ప్రాంతానికి ఇతరులు వెళ్లిన సమయంలో జాగ్రత్తలు పాటించకపోవడంతో అడవి అగ్నికి ఆహుతి అవుతుందన్నారు. వంట చెరకు, పశువులను, మేకలు, గొర్రెలను మేపేందుకని ఎవరు కూడా వెళ్లవద్దని సూచించారు. అడవులను కాపాడుకోవడంలో అటవీ శాఖకు ప్రజలు సహకరించాలని, మంటల చెలరేగితే విలువైన అటవీ సంపదకు, వన్య ప్రాణులకు తీవ్ర నష్టం జరుగుతుందనే విషయాన్ని ప్రజలు గమనించాలని తెలియజేశారు. ఇలాంటి సమయంలో వన్య ప్రాణులు గ్రామాల వైపు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు.

రామన్‌పాడులో తగ్గుతున్న నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం తగ్గుతుంది. మంగళవారం 1,017 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపి వేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

ఇసుక వార్



అయ్యవారిపల్లిలో ఇసుక టిప్పర్లను అడ్డుకుంటున్న గ్రామస్తులు

- అయ్యవారిపల్లిలో ఇసుక టిప్పర్ల అడ్డగింపు
- అధికార, ప్రతిపక్ష నేతల మధ్య విమర్శలు

జడ్చర్ల: నియోజకవర్గంలో కొద్ది రోజులుగా ఇసుక వార్ కొనసాగుతుంది. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల మధ్య పరస్పర ఆరోపణలు, విమర్శలు ఘాటెక్కుతున్నాయి. దీంతో ఇసుక అవసరం కలిగిన సామాన్యులు దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, మరో వైపు అక్రమార్కులు మాత్రం తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఎవరికి వారు ఘాటుగా స్పందిస్తున్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య ముదిరిన విభేధాలు

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పాటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలువడంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య విభేదాలు మరింత ముదిరాయి. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తనదైన శైలిలో ఇసుక దందా, భూకబ్జాలు, ఇతర అక్రమాలను సహించేది లేదని బాహాటంగానే తెగేసి చెప్పారు. గత పాలనలో యథేచ్ఛగా కొనసాగిన ఇసుక అక్రమ దందాలు, భూకబ్జాలు మానుకోకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో అక్రమాలకు తమకు ఎలాంటి సంబంధం లేదని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వర్గీయులు ఎమ్మెల్యేపై విమర్శలకు దిగుతున్నారు. గతంలో బీఆర్‌ఎస్‌కు చెందిన వారు ఇసుక దందాలు, భూ కబ్జాలకు పాల్పడ్డారని కాంగ్రెస్ ఆరోపిస్తుండగా, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇసుక దందాలు, భూకబ్జాలకు తెరలేపారని బీఆర్‌ఎస్ ఎదురుదాడికి దిగుతుంది. తాను రాజకీయాలలోకి వచ్చి రూ.కోట్లు పోగొట్టుకున్నానని, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాత్రం రూ.కోట్లు కూడబెట్టారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన విమర్శలు చర్చనీయాంశంగా మారాయి. అంతేగాక గంగాపూర్ నుంచి బాలానగర్ వరకు డబుల్‌రోడ్డు విస్తరణ పనులు కూడా రాజకీయ దుమారం రేపుతున్నాయి.

ఇసుక పంచాయితీ తీవ్రం

నియోజకవర్గంలో రోజు రోజుకు ఇసుక పంచాయితీ తీవ్రం అవుతుంది. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఎమ్మెల్యే స్పష్టం చేయడంతో పోలీసులు ఎక్కడికక్కడ కట్టుదిట్టం చేసి ఇసుక అక్రమ రవాణాపై కేసులు నమోదు చేస్తూ వస్తున్నారు. మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్‌లో అక్రమంగా ఇసుక ఫిల్టర్ చేసి తరలిస్తున్న 9 టిప్పర్లను ఒకేసారి దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారంటే పరిస్థితిని ఊహించవచ్చు. ఇదే సమయంలో మిడ్జిల్ మండలం అయ్యవారిపల్లి వద్ద గల దుందుబీ వాగు ఇసుక వ్యవహారం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య ఆరోపణలకు వేదికగా మారింది. తాము అధికారంలో ఉన్న సమయంలో ఇసుక డంపును అనుమతులతో తరలిస్తుండగా అప్పట్లో అడ్డుకున్న అనిరుధ్‌రెడ్డి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ఇసుక డంపులను అనుమతులతో తరలించడంలోని ఆంతర్యం ఏమిటని బీఆర్‌ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. కాగా అప్పట్లో దుందుబీ వాగులో నిబంధనలకు విరుద్ధంగా మూడు అడుగులకు పైగా ఇసుక తవ్వకాలు చేసి అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకున్నామని, ప్రస్తుతం అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక డంపులకు వేలం నిర్వహించి జిల్లా వైద్య కళాశాల, ఇతర అభివృద్ధి పనులకు మాత్రమే ఇసుకను వినియోగించే విధంగా కలెక్టర్ ఆదేశాలతో నిబంధనలకు లోబడి వ్యవహరిస్తున్నామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొంటున్నారు.

ఇసుకను తరలిస్తే అందోళన చేస్తాం



గతంలో ఇసుకను తరలిస్తుంటే అడ్డుకున్నాం. పోలీసులు తమపై కేసులు కూడా నమోదు చేశారు. కోర్టు చుట్టూ తిరుగుతున్నాం. మళ్లీ ఇప్పుడు ఇసుకను తరలిస్తామంటే ఊరుకోం. ఆందోళనలు చేసి తమ ఇసుకను కాపాడుకుంటాం.

–నర్సింహారెడ్డి, రైతు, అయ్యవారిపల్లి

రైతులకే అప్పగించాలి



ఇసుక డంపులను రైతులకే అప్పగించాలి. చౌడు నేలల్లోకి ఇసుకను తరలించి పంటలు పండే విధంగా ఇసుకను వినియోగించుకుంటాం. అధికారులు, పాలకులు న్యాయంగా ఆలోచించాలి. రైతులకు మేలు చేసేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికే బోర్లు ఎండిపోయి సాగు కష్టంగా మారింది.

–శ్రీకాంత్, రైతు, అయ్యవారిపల్లి

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

మిడ్జిల్ మండలం అయ్యవారిపల్లి గ్రామస్తులు మంగళవారం ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. తమ గ్రామ అవసరాలకు, చౌడు నేలలకు ఇసుకను వినియోగించుకునేలా అనుమతులు ఇవ్వాలని ఈ సందర్భంగా పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రజావాణిలో కలెక్టర్‌కు కూడా వినతిపత్రం ఇచ్చామని రైతులు తెలిపారు. తమ విజ్ఞప్తిని పట్టించుకోకుండా కలెక్టర్ వేలం నిర్వహించి ఇసుకను కాంట్రాక్టర్‌కు అప్పగించారని తెలిపారు. దీనిపై హైకోర్టు స్టే కూడా ఉందన్నారు. స్టే గడువు ముగియకముందే వేలం వేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇసుక రవాణాను నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని వారు హెచ్చరించారు. ఇసుక డంపులకు వేలం నిర్వహించి అభివృద్ధి పనులకు వినియోగించే విధంగా కలెక్టర్ అనుమతి ఇచ్చారని తహసీల్దార్ రాజునాయక్ తెలిపారు.

మధ్యాహ్న భోజనం తిని.. విద్యార్థులకు అస్వస్థత



విద్యార్థులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల క్రైం: మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన మంగళవారం మండలంలోని రేకులపల్లిలో చోటు చేసుకుంది. విద్యార్థుల తల్లిదండ్రులు, వైద్యులు తెలిపినా వివరాల మేరకు... రేకులపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. తిన్న తర్వాత 13మంది విద్యార్థులకు వాంతులు, తలనొప్పి బారినపడ్డారు. గ్రహించిన ఉపాధ్యాయులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వారికి చికిత్స అందించారు. ఫుడ్ పాయిజన్ వలనే అస్వస్థతకు గురయ్యారని వైద్యులు తెలిపారు. విద్యార్థులను జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ ఘటనపై నివేదిక ఇవ్వాలని ఎంఈఓ సురేష్‌కు ఆదేశాలు జారీ చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని పాఠశాల ఉపాధ్యాయులను మందలించారు. విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించేందుకు పూర్తి సహాయసహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. చికిత్స అనంతరం విద్యార్థులను వైద్యులు ఇంటికి పంపించారు.

సంతోషంగా జీవితం గడపాలి

- సైకిల్ యాత్రికుడు ముత్తుకుమార్



సైకిల్‌యాత్రికుడికి స్వాగతం పలికిన సైక్లింగ్ సభ్యుడు రవిశంకర్

జడ్చర్ల టౌన్: ప్రతి ఒక్కరు ఉన్న దాంట్లో తృప్తి పడుతూ సంతోషంగా జీవించాలని సైకిల్ యాత్రికుడు ముత్తుకుమార్ పిలుపునిచ్చారు. ముత్తకుమార్ గతేడాది ఆగస్టు నెల మొదటి వారంలో స్వగ్రామం బెంగుళూరు నుంచి సైకిల్‌పై కాశీ బయలుదేరి తిరుగు ప్రయాణంలో మంగళవారం తెల్లవారుజామున పట్టణానికి చేరుకున్నాడు. పట్టణంలో సైక్లింగ్ క్లబ్ సభ్యుడు రవిశంకర్ అతడికి బస కల్పించారు. ఈ సందర్భంగా ముత్తుకుమార్ తన అనుభవాలను వెల్లడించారు. ఇప్పటి వరకు మూడు పర్యాయాలు సైక్లింగ్ యాత్ర చేసినట్లు తెలిపారు. మూడో యాత్రలో 6వేల కిలోమీటర్లు పూర్తిచేసినట్లు వెల్లడించారు. కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు, ఢిల్లీ, యూపీ, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, ఝార్ఖండ్, ఒడిశా, ఆంధ్ర పూర్తిచేసినట్లు తెలిపారు. ఎలక్ట్రీషియన్‌గా జీవితం ప్రారంభించిన తాను భార్య నిర్మల ఇద్దరు సంతానం ఉన్నారని, కూతురు దేవిప్రియ, కుమారుడు ఆర్ముగం సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారని చెప్పారు. ప్రాణం పోయినపుడు వెంట ఏమి తీసుకెళ్లమని, ఉన్నన్నిరోజులు సంతోషంగా గడపాలని పది మందికి చెబుతూ యాత్ర చేస్తున్నట్లు చెప్పారు. యాత్రలో తనకు అనేక అనుభవాలు ఎదురయ్యాయని, సైకిల్ చూసి ఆపి ఎక్కడికి వెళ్తున్నారని దారి పొడుగునా అడుగుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. పరిచయం లేని వ్యక్తులు తనను పలకరించటమే గొప్ప ఆనందంగా అభిప్రాయపడ్డారు. యాత్ర చివరి దశకు చేరుకుందని, ఆరురోజుల్లో ఇంటికి చేరుకుంటానని తెలిపారు.

పోలీస్‌స్టేషన్ల తనిఖీ



ఐజీపీ రమేష్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట రూరల్: నారాయణపేట రూరల్, ధన్వాడ పోలీస్‌స్టేషన్లను మంగళవారం ఐజీపీ ఎం.రమేష్‌రెడ్డి తనిఖీచేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించడంతో పాటు కేసుల దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో చేపట్టిన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై స్థానిక పోలీసులతో చర్చించారు. నాణ్యతగా పనులు చేపట్టి, త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అంతకుముందు ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

బీఆర్‌ఎస్ కనుమరుగే లక్ష్యం



పార్టీలో చేరిన కౌన్సిలర్లతో యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఇతర నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన మేరకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితోనే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధ్యమైందన్నారు. మహబూబ్‌నగర్ అభివృద్ధికి 15 మంది కౌన్సిలర్లు పార్టీలో చేరినట్లు వివరించారు. ఎమ్మెల్యేగా తాను, పుర చైర్మన్‌గా కాంగ్రెస్‌పార్టీ వ్యక్తి ఉంటే అభివృద్ధిపరంగా ముందుకుసాగుతామనే లక్ష్యంతో మున్సిపాలిటీని కైవసం చేసుకున్నట్లు చెప్పారు. కేవలం నలుగురు కౌన్సిలర్లు ఉన్న కాంగ్రెస్‌పార్టీకి అవిశ్వాసం పెట్టడం కష్టమైనప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం వివిధ పార్టీల కౌన్సిలర్లు ప్రజాస్వామ్యం కోసం సాధ్యం కాని అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా నిలిచినట్లు తెలిపారు. ఒకరిద్దరి స్వార్థ రాజకీయాల కోసం చేరికలు వద్దనుకున్నా సీఎం సూచన మేరకు ఆపరేషన్ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీని విజయవంతం చేసినట్లు తెలిపారు. ఏ పార్టీలో ఉన్నా విమర్శలు, ప్రతి విమర్శలు సర్వసాధారణమని.. తెలంగాణ గడ్డమీద బీఆర్‌ఎస్ పార్టీని కనుమరుగు చేయాలంటే సరైన వ్యూహాలు కూడా తమకు ఉండాలని.. అధిష్టానం సూచనలు తప్పక పాటిస్తామని తెలిపారు. అనంతరం కౌన్సిలర్లకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వినోద్ కుమార్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, నాయకులు సురేందర్‌రెడ్డి, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆందోళన



నిరసన తెలుపుతున్న చంద్రశేఖర్

విలేకర్ల సమావేశం ముగిసిన అనంతరం కార్యాలయం పైఅంతస్తు హాల్‌లో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్, మరో కార్యకర్త కుర్వ నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎన్నో బెదిరింపులకు గురయ్యామని, కేసులను ఎదుర్కొన్నామని.. ఇప్పుడు బీఆర్‌ఎస్ నాయకులను పార్టీలోకి తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు వారిని సముదాయించే ప్రయత్నం చేసిన వారు తమ ఆవేదనను వెళ్లగక్కారు. పార్టీ కోసం పని చేసిన తమలాంటి వారికి ఎవరు న్యాయం చేస్తారని కుర్వ నరేష్ కన్నీటి పర్యంతమయ్యారు. చంద్రశేఖర్ చొక్కా విప్పి కింద కూర్చొని ఆందోళన చేశారు.

మద్యం మత్తులో పోలీసులపై దాడి

జడ్చర్ల: కొత్త బస్టాండ్‌లో పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దాడికి పూనుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఆదిరెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొత్త బస్టాండ్‌లో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత వల్లూరుకి చెందిన శ్రీకాంత్ మద్యం మత్తులో బస్టాండ్ పరిసర ప్రాంతంలోని ట్రాన్స్‌జెండర్‌లపై వీరంగం సృష్టించాడు. అడ్డుకోబోయిన ఓ ప్రయాణికుడిపై సైతం దౌర్జన్యం చేశాడు. దీంతో వారు 100కు డయల్ చేయడంతో అక్కడకు చేరుకున్న పోలీసులపై రాయితో దాడికి పాల్పడ్డాడు. వీరిలో కానిస్టేబుల్ చందర్ చేతికి గాయమైంది. గాయపడిన కానిస్టేబుల్‌ను వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. నిందితుడిపై పలు పాత కేసులు ఉన్నాయని ఈ సందర్భంగా వివరించారు.

న్యాయం చేయాలని యువతి ఆందోళన

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త తనకు తెలియకుండా మరో యువతిని పెళ్లి చేసుకున్నాడని.. తనకు న్యాయం చేయాలని గద్వాలకు చెందిన సోఫియా మంగళవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లో భర్త ఆసిఫ్ ఇంటి ఎదుట బైఠాయించింది. బాధితురాలి కథనం ప్రకారం.. హైదరాబాద్‌లో ఒకే అపార్ట్‌మెంట్ వద్ద నివాసం ఉండే ఆసిఫ్‌తో సోఫియాకు పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. ఈక్రమంలో సోఫియాను గద్వాలలోని తన ఇంటి నుంచి తీసుకెళ్లి 2015లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. 2018 వరకు వీరి కాపురం సజావుగానే సాగింది. ఆ తర్వాత శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసి, వెళ్లిపోయాడని బాధితురాలు వాపోయింది. అతడిపై కేసు వేయగా, కోర్టులో నడుస్తోందని.. గత సంవత్సరం తనకు తెలియకుండా మరో యువతిని పెళ్లి చేసుకున్నాడని సమాచారం అందిందని పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని గోలేటి టౌన్‌షిప్‌లోని భర్త ఇంటి ఎదుట మ్యారేజ్ సర్టిఫికెట్‌తో బైఠాయించింది. రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఇరువురి కుటుంబాల పెద్దలతో మాట్లాడి బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని ఎస్‌ఐ చంద్రశేఖర్ హామీ ఇచ్చినట్లు సమాచారం.

జాతీయ బాడీబిల్డింగ్ పోటీలకు ప్రేమ్‌కుమార్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రానికి చెందిన సీనియర్ బాడీబిల్డర్ డాక్టర్ కేఎస్‌ఈఎన్ ప్రేమ్‌కుమార్ జాతీయస్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో పాల్గొంటున్నారు. చెన్నైలో 23 నుంచి 25 వరకు జరిగే జాతీయస్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో రాష్ట్రం నుంచి పాల్గొంటున్న ఆయన మాస్టర్స్ విభాగం 60 ఏళ్లపైబడి కేటగిరిలో పోటీపడుతున్నారు. ప్రేమ్‌కుమార్ ఇప్పటి వరకు పదిసార్లు జాతీయస్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో పాల్గొనగా 2022లో పుదుచ్చేరిలో జరిగిన పోటీల్లో మాస్టర్స్ విభాగంలో ఐదోస్థానంలో నిలిచారు. మాస్టర్స్ విభాగంలో ఇప్పటి వరకు 15 సార్లు విజేతగా నిలిచారు.

నవబ్రహ్మ ఆలయాల మరమ్మతు పనుల పరిశీలన



సమస్యలపై డిప్యూటీ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకొస్తున్న ఆలయ గుమాస్తా చంద్రయ్యాచారి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పుణ్యక్షేత్రంలోని నవబ్రహ్మ ఆలయాలను అలాగే పాపనాశిని, సంగమేశ్వర ఆలయాలను మంగళవారం ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ సూపరింటెండెంట్ రోహిణి ఆకస్మికంగా పరిశీలించారు. ఇక్కడి మాన్యూమెంట్స్ మరియు ప్రధాన ఆలయాలైన బాలబ్రహ్మేశ్వర స్వామివారి వద్ద కొనసాగుతున్న నిర్మాణ పనులను ఆమె తనిఖీ చేశారు. పనులు నాణ్యతగా, త్వరితగతిన చేయాలన్నారు. పురాతన కట్టడాల పరిరక్షణ చేపట్టాలన్నారు. జోగుళాంబ ఆలయ పాలక మండలి చైర్మన్ చిన్నకృష్ణయ్య డిప్యూటీ సూపరింటెండెంట్‌ను కలిసి వినతి అందజేశారు. 24 ఆలయాల సముదాయమైన పాపనాశేశ్వర ఆలయంలో టికెట్టు విక్రయాలు, ప్రసాదాల విక్రయాలు ప్రవేశ పెట్టేందుకు అనుమతులు కోరారు. అలాగే ప్రధాన ఆలయమైన బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయం ముందు నది మండపం వద్ద ఇటీవల కాలంలో నిర్మించిన కట్టడాలను తొలగించి ప్రధాన ఆలయానికి పూర్వం నిర్మాణ శైలి కనిపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నవగ్రహాలు, గణపతి, బాలబ్రహ్మేశ్వర విగ్రహాల వద్ద అభిషేకం నీరు బయటకు వెళ్లేలా మార్గం ఏర్పాటు చేయాలని కోరారు. వీరితో పాటు ఆలయ గుమాస్త చంద్రయ్య ఆచారి వెంట ఉన్నారు.

ఘనంగా ఆరుద్రోత్సవం



అన్నంతో అలంకరించిన బాలబ్రహ్మేశ్వరస్వామి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఆరుద్రోత్సవాన్ని నిర్వహించారు. గోమాతకు ప్రత్యేక పూజల అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. గణపతికి పంచామృతాలతో అభిషేకాలు, హరిద్రలేపన అలంకరణలు చేశారు. భక్తులచే మహాన్యాస పారాయణాలు, బాలబ్రహ్మేశ్వరుడికి ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. అభిషేకించిన అన్నాన్ని లింగాకృతిలో అలంకరించారు.

ఆలయంలో మరమ్మతు పనులు..

బాలబ్రహ్మేశ్వర గర్భాలయం చుట్టూ ప్రాకార మండప ప్రదక్షిణ వద్ద పాత బండలను తొలగించి, ఎర్రరాతి బండలు పరిచేందుకు పనులు చేపట్టారు. పాత బండల తొలగింపును వేగవంతం చేసి, మహాశివరాత్రి నాటికి ఎర్రరాతి బండలు వేయనున్నట్లు ఆలయ ఈఈ పురేందర్‌కుమార్ తెలిపారు.

ప్రేమ వివాహం చేసుకుందని..

చెల్లిపై కత్తితో దాడి చేసిన అన్న • పరిస్థితి విషమం



చికిత్స చేస్తున్న వైద్యుడు

అచ్చంపేట రూరల్: ప్రేమ వివాహం చేసుకుందని ఓ అన్న చెల్లెలిని కత్తితో దాడి చేసిన ఘటన మంగళవారం మండలంలోని గుంపన్‌పల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెంచుపల్లుతండాకు చెందిన అఖిల, గుంపన్‌పల్లికి చెందిన శ్రీరాం ప్రేమించుకున్నారు. ఇటీవల దేవాలయంలో వివాహం చేసుకున్నారు. వారం రోజుల కిందట పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. స్థానిక పోలీసులు ఇరువురి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. యువతి మైనర్ కావడంతో పెద్దలు ఎవరి ఇంటికి వారు వెళ్లాలని సూచించారు. రెండు రోజుల క్రితం యువతి గుంపన్‌పల్లికి వచ్చింది. విషయం తెలుసుకున్న యువతి సోదరుడు అఖిల్ మంగళవారం గుంపన్‌పల్లికి వచ్చి చెల్లెలితో మాట్లాడుతూ.. ఒక్కసారిగా తన వెంట తెచ్చుకున్న కత్తితో నడుము భాగాన పొడిచాడు. ఆమె అరవడంతో అఖిల్ అక్కడి నుంచి పారిపోయాడు. ఇరుగుపొరుగు వారు వచ్చి యువతిని అచ్చంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. కిడ్నీ భాగాన గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించినట్లు గుంపన్‌పల్లి మాజీ సర్పంచ్ రతన్‌సింగ్ తెలిపారు. అఖిల ఫిర్యాదు మేరకు సోదరుడు అఖిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు.

పశువుల పట్టివేత



మిర్యాలగూడ టౌన్: మినీ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పశువులను మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. రూరల్ ఎస్‌ఐ సతీష్‌వర్మ వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన మహ్మద్ ఫయీమ్ సోమవారం సూర్యాపేట జిల్లా కోదాడ వ్యవసాయ మార్కెట్‌లోని పశువుల సంతలో రెండు ఆవులు, ఎనిమిది కోడె దూడలను కొనుగోలు చేసి, మినీ వ్యాన్‌లో మిర్యాలగూడ మీదుగా అచ్చంపేటకు తరలిస్తుండగా.. వెంకటాద్రిపాలెం వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఫయీమ్ వద్ద పశువుల కొనుగోలుకు సంబంధించి ఎలాంటి వివరాలు లేకపోవడంతో పశువులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన పశువులను నాగర్‌కర్నూల్ జిల్లా కర్రెవానిపల్లె గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.